ప్రజాశక్తి

శనివారం 26 నవంబర్ 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





చెత్త సంపద ఏది?

- నామమాత్రంగా తయారీ కేంద్రాలు
- క్లాప్ మిత్రాలు, మౌలిక వసతుల కొరత



తోట్లవల్లూరులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

"క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంతో గ్రామాలన్నీ పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి" అని చెప్పే ప్రభుత్వ ప్రకటనలకూ, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితికీ పొంతన కుదరడం లేదు. కృష్ణాజిల్లాలోని వందలాది గ్రామ పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో లెక్కకు మించిన సమస్యలు తిష్టవేశాయి.

తోట్లవల్లూరు మండలం వేకమూరు గ్రామ పంచాయతీలో బందరు కాల్వ పక్కనే చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నిరుపయోగంగా మారిపోయింది. గ్రామంలో సేకరించిన చెత్తను కాల్వ పక్కనే డంపింగ్ చేస్తున్నారు. ఈ చెత్తంతా లక్షలాది మందికి దాహార్తిని తీరుస్తున్న బందరు కాల్వలో కలిసిపోతోంది. మండల కేంద్రం తోట్లవల్లూరులో సంపద తయారీ కేంద్రాన్ని ఆరేళ్ల క్రితం కృష్ణానది ఒడ్డున నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన తాటాకు కప్పును తొలగించి ఏడాది క్రితం రేకుల షెడ్‌గా మార్పుచేశారు. అయితే అది ఇప్పటికీ నిరుపయోగంగానే దర్శనమిస్తోంది. కృష్ణాజిల్లాలో 472 గ్రామ పంచాయతీల్లో షెడ్లను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సేకరించిన తడి పొడి చెత్తను విడివిడిగా షెడ్లకు తరలించి సేంద్రీయ ఎరువులను తయారు చేయాల్సి ఉంది. కానీ చాలా షెడ్లలో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కొన్ని గ్రామాల్లో షెడ్లు నిరుపయోగంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను ప్రాసెసింగ్ చేసే పరిస్థితి లేక కాల్వల్లోనూ, నదిలోనూ డంప్ చేస్తున్నారు.

అన్నీ కొరతే...

250 గృహాలకు 'క్లాప్ మిత్ర' పేరుతో ఒక్కొక్కరి చొప్పున జిల్లాలోని 491 గ్రామ పంచాయతీల్లో 2,685 మందిని నియమించాల్సి ఉంది. కానీ ఇంకా 1412 మందిని భర్తీ చేయాల్సి ఉంది. 'క్లాప్ మిత్ర'లకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో చాలా పంచాయతీల్లో చెత్త సేకరణకు ఎవరూ ముందుకు రావడం లేదు. గ్రామాల్లో చెత్త సేకరణకు 967 ట్రై సైకిళ్లు అవసరం ఉంది. కానీ 547 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇంకా 645 ట్రై సైకిళ్లు స్వచ్ఛాంధ్రకార్పోరేషన్ సమకూర్చాల్సి ఉంది. 322 షెడ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. వానపాముల ఎరువులు తయారీ నిమిత్తం షెడ్లకు నీటి వసతి అవసరం. 251 షెడ్లకు వాటర్ కనెక్షన్లు లేవు. 73 షెడ్లకు రోడ్డు వసతి లేదు. ఈ మౌలిక వసతులు సమకూరితేనే పూర్తి స్థాయిలో సంపద తయారీ కేంద్రాలు ఉపయోగంలోకి వచ్చే పరిస్థితి ఉంది.



వేకమూరు గ్రామంలోని బందరు కాల్వలో చెత్త డంప్ చేసిన దృశ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

మహిళలను గౌరవించడం ద్వారానే

హింస నివారణ

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : మహిళలను గౌరవించడం ద్వారానే హింసను అరికట్టగలమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. తల్లి, చెల్లి, భార్య స్థానాలకు ప్రతిరూపమైన స్త్రీని కుటుంబ వ్యవస్థలో పవిత్రమైన స్థానంతో ఆరాధించాలన్నారు. అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకొచ్చినా వారిపై ఇంకా లైంగిక వేధిపులు, అత్యాచారాలు వంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. మహిళా హింస నివారణపై పురుషులతో అవగాహన సదస్సు నిర్వహిస్తే మరింత మంచి ఫలితాలు ఉంటాయన్నారు. స్త్రీ పట్ల అనుసరించాల్సిన ప్రవర్తన, మహిళలపై శారీరక, మానసిక, లైంగిక హింసలకు పాల్పడిన వారికి చట్టాల ద్వారా తీసుకునే కఠిన చర్యలు వివరిస్తే హింసను అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన, మహిళా చట్టాలు-హక్కులపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన చైల్డ్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ 100/112 వంటి హెల్ప్‌లైన్లను సంప్రదించడం ద్వారా రక్షణ పొందాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మానవహారంలో "నేను సైతం నాదేశ మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస, దోపిడీ, అత్యాచారాలు, లైంగిక వేధింపులను వ్యతిరేకిస్తాను...మహిళా హక్కుల పరిరక్షణ, సాధికరతకు భరోసాగా ఉంటాను" అనిజిల్లా కలెక్టర్ డిల్లీరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, (మిగతా 6లో)



కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్ బాషాతో సమావేశమైన గన్నవరం ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్

విమానాశ్రయ విస్తరణ

బాధిత రైతులకు న్యాయం చేయండి

- గన్నవరం ఎంఎల్ఎ వంశీమోహన్
- నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌తో భేటీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : గన్నవరం విమానాశ్రయం విస్తరణకు భూములిచ్చిన పట్టా భూముల రైతుల్లో కొంతమందికి అమరావతిలో ప్లాట్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ సైతం చేశారని, కానీ ఇంకా కొంత మంది రైతులకు ఇప్పటికీ ఎటువంటి నష్టపరిహారం అందలేదని గన్నవరం శాసనసభ్యులు వల్లభనేని వంశీమోహన్ కృష్ణాజిల్లా కలెక్టర్ (మిగతా 6లో)

డబ్బులివ్వండి మహాప్రభో...

- ఇళ్ల స్థలాల కోసం 90 ఎకరాల సేకరణ
- ఒప్పందం జరిగి ఏడాది
- ఆందోళనలో కొత్తూరు తాడేపల్లి రైతులు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు చేపట్టిన 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చరిత్రలో ఎన్నటికీ గుర్తుండేందుకు, ఆ సంఖ్య ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం భూములు సేకరించింది. కానీ చరిత్రలో గుర్తింపుకు తగ్గట్లుగా ఆ భూములు ఇచ్చిన రైతులకు మాత్రం డబ్బులు చెల్లించడంలో తాత్సారం జరుగుతోంది. ఏడాది క్రితం భూమిని సేకరించిన అధికారులు ఒప్పందాలు చేసుకున్నా, నేటికీ ఒక్క రూపాయి సంబంధిత రైతులకు పరిహారం అందించలేదు. దీంతో కుటుంబ అవసరాల కోసం భూములను అమ్ముకునేందుకు కూడా ఆటంకం ఏర్పడుతోందని ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామ రైతులు ఆందోళన చెందుతున్నారు. జగన్ పాదయాత్ర 3,648 కిలోమీటర్లు గుర్తుండేలా కొత్తూరు తాడేపల్లిలో అంత మంది పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం భూములను సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో మండల రెవెన్యూ అధికారులు కొత్తూరు తాడేపల్లిలో 90 ఎకరాలను సేకరించారు. అప్పట్లోనే బహిరంగ మార్కెట్లో ఎకరం ధర కోటి రూపాయలున్నా రైతులు రూ.75 లక్షలకే భూములను ఇచ్చేందుకు అంగీకరించారు. ఆ తర్వాత రైతుల నుంచి పట్టాదారు పాసు పుస్తకాలు, దస్తావేజుల జిరాక్స్ కాపీలను రెవెన్యూ అధికారులు తీసుకున్నారు. అనంతరం ఆ సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్ శాఖకు పంపి క్రయ విక్రయాలు జరగకుండా ఫ్రీజ్ చేశారు. ఆ తర్వాత రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని గతేడాది డిసెంబర్లోనే డబ్బులు చెల్లించేందుకు ఆమోదం తెలుపుతూ రెవెన్యూ స్టాంప్లపై రైతుల సంతకాలు తీసుకున్నారు. ఇదంతా జరిగిన ఆరు నెలలైనా రైతులకు భూముల డబ్బులు అందలేదు. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ముగిసి కూడా నెలలు దాటింది. కుటుంబాలలో పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువుల కోసం భూములను అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్లు జరగడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదంటున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ వస్తోంది. పంటలు కూడా నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో (మిగతా 6లో)



కొత్తూరు తాడేపల్లిలో రైతుల నుండి కొనుగోలు చేసిన భూమి

ఆశాలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి : కమల

ప్రజాశక్తి-గంపలగూడెం: నిరంతరం శ్రమిస్తున్న ఆశా వర్కర్లకు 26వేల రూపాయలు వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి కమల డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు స్థానిక సిఐటియు కార్యాలయంలో ఐదవ మండల మహాసభ జి అరుణ అధ్యక్షతన జరిగింది.




మాట్లాడుతున్న కమల

ఈ కార్యక్రమంలో కమల మాట్లాడుతూ అనేక అవసరాలు నిమిత్తం వర్కర్లకు ప్రభుత్వం స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లు ఈ సందర్భంగా వివరించారు. మహాసభ అనంతరం మండలంలోని ఊటుకూరు, గంపలగూడెం ఆరోగ్య కేంద్రాల వారీగా నూతన కార్యవర్గాలు ఏర్పడ్డాయి. అనంతరం గంపలగూడెం అధ్యక్ష కార్యదర్శులుగా పి చంద్రకళ, పి సుమలత, ఊటుకూరు బి లక్ష్మి, జి అరుణలతో పాటు ఆయా కమిటీలకు తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు గువ్వల సీతారామరెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు కోరుతూ వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ కార్మికులకు 5 నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ కొండపల్లి మున్సిపల్ కార్యాలయ ఇన్‌చార్జ్ అకౌంటెంట్ నవీన్‌కు వినతి పత్రం శుక్రవారం అందజేశారు.



ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపల్ కార్మికులకు 5 నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలని, ఇఎస్‌ఐ కార్డులు అందజేయాలని, ప్రతి బుధవారం ఒకపూట శెలవు ఇవ్వాలి సెఫ్టీ జా కెట్లు సబ్బులు చెప్పులు యూనిఫాం జత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దేవుళ్ళ రమణ, అప్పారావు, సూరిబాబు, సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : రక్షణనిధి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: అర్హత కలిగిన ఉన్న ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు దళితవాడ మాలపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జల జీవన్ మిషన్ పథకం నిధులు రూ.38 కోట్లతో ఇంటింటికీ కృష్ణాజలాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, సర్పంచ్ కోట పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-వత్సవాయి: సిఎం జగన్ రోడ్ల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని భీమవరం నుండి చిల్లకల్లు వైరా రహదారి వరకు జరుగుతున్న రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.



ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. కోటితో జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు గ్రామం నుండి వత్సవాయి మండలం భీమవరం గ్రామాల మధ్య గల 800 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు గుండం రంగారెడ్డి, అడ్వకేట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాల్గో వార్డులో ఉదయభాను పర్యటన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని కొత్త వెంకటేశ్వర స్వామి సీతారామపురం 4 వ వార్డు పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొని గడపగడపకు వెళుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సామినేని వెంకటకృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, టౌన్ పార్టీ ప్రెసిడెంట్, కౌన్సిలర్ కొలగాని రాము, వైసీపీ నాయకులు తోట కృష్ణవేణి శంకర్, తోట శంకర్, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ పసుపులేటి రాధాసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి : జోయ



చందర్లపాడులో మాట్లాడుతున్న జోయ

ప్రజాశక్తి-చందర్లపాడు: చందర్లపాడులో రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు యార్లగడ్డ జోయ మాట్లాడుతూ విజయవాడలో 26న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రైతుల రుణాలు రద్దు చేయాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లు నిలిపేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఉపసంహరించుకోవాలని, భూ సర్వేలో వస్తున్న తప్పులను సక్రమంగా సరిచేయాలని, ప్రతి గ్రామంలో గ్రామ సభలు విధిగా నిర్వహించాలని, ధాన్యం మొత్తం మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని, ఏడు రోజులకు రైతులకు పైకం ఇవ్వాలని, ఈ కాలంలో అధిక వర్షాలకు వరదలకు నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు, కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి సందిపోగు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వత్సవాయి: వత్సవాయిలో రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మినేని రాంబాబు మాట్లాడుతూ రైతు సమస్యలపై జరిగే ధర్నాలో రైతులు, కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆహార నియమాలతో మధుమేహం నియంత్రణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: సరైన ఆహార నియమాలు పాటించడం ద్వారా షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చునని ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు నిమ్రా హస్పిటల్ వైద్యులు డాక్టర్ జయరాం అన్నారు స్థానిక నిమ్రా నర్సింగ్ కళాశాలలో శుక్రవారం షుగర్ వ్యాధి నివారణ మరియు అదుపు చేయటం ఎలా అనే అంశంపై జాతీయ స్థాయి వెబినార్ నిర్వహించారు. నిమ్రా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో జయరాం మాట్లాడుతూ వ్యాయామం చేయడం ద్వారా షుగర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చునన్నారు. వెబినార్‌లో దేశవ్యాప్తంగా 150 మందికి పైగా పాల్గొన్నారు. వెబినార్ కన్వీనర్‌గా నిమ్రా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరి కో ఆర్డినేటర్లుగా నిమ్రా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జనార్ధన్ నాగుల్‌మీరా వ్యవహరించారు.

రైతు బజారు నిర్మాణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ప్రస్తుత రైతు బజారు చాలా రద్దీగా ఉండటమే కాకుండా ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది పడేలాగా స్థలం తక్కువగా ఉందని వినియోగదారుల నుండి ఫిర్యాదు రావడంతో కొత్త రైతు బజార్ నిర్మించడానికి చెరువు పక్కగా ఉన్న స్థలాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరీలించారు. పట్టణాన్ని గ్రీన్ జగ్గయ్యపేటగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఆకుల బాజీ, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, నూకల సాంబశివరావు, సాదుపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-తిరువూరు: మండలంలోని, కాకర్ల సోసైటి పర్యవేక్షణలో ఆర్బికే లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిసిఓ చిత్రపు శైలజ, డిఆర్ కిరణ్ కుమార్, ఎస్ డిఎల్ సిఓ జ్యోతిర్మయిలు శుక్రవారం పరిశీలించి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధ నల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం పిఎసిఎస్ అధ్యక్షులు తాళ్ళూరి నవీన్ కుమార్, సిఈఓ బొల్లినేని రఘురామ్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: పట్టణ టాక్స్ కన్సల్టెంట్ ప్రకాష్ నందిరాజు వ్యవస్థాపక అధ్యక్షులుగా స్థాపించిన ఎన్ఎస్ఆర్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకాష్ నందిరాజు కుమారుడు సాయిమణి నందిరాజు జన్మదిన సందర్భంగా పేదలకు దుప్పట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రాజా హనుమంతరావు, నందిరాజు కల్పన, జీకే మూర్తి, లక్ష్మి, కేజీకే మూర్తి, మధుసూదనరావు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-నందిగామ: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం కళాజాత కార్యక్రమం శుక్రవారం నందిగామ పట్టణం గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు, నాటికలు, నృత్యం ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ సుమన్, మహిళా సొసైటీ సిబిఓ షీబా పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు క్యాన్లు పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మాగల్లులో విజయ పాల శీతల కేంద్ర పరిధిలోని మాగల్లు పాల సంఘంలో పాల ఉత్పత్తిదారులకు స్టీల్ క్యాన్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ నెలకుత్తి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మేనేజర్ కిరణ్, తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలి : సామినేని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా సిబ్బంది పని చేయాలని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్‌పి గెస్ట్‌హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో నూతనంగా నియమితులైన పులిచింతల ప్రాజెక్టు ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభానును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పులిచింతల ప్రాజెక్టు ఈఈ శ్యామ్‌ప్రసాద్, డీఈ కిషోర్, కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ ద్వారా ఇంటింటికీ కుళాయి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల: జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కంచికచర్ల మండలానికి 13.37 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. కంచికచర్ల మండలం సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మలక్ బషీర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులందరికీ సమీకృత ఆహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం మెనూను మార్చిందన్నారు. ఈ క్రాప్ నమోదు విషయంలో పొరపాటు లేకుండా చూసుకోవాలని కోరారు. పెసలు కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని కోరారు. యంపిటిసి బర్రె ఉదయ్‌కిరణ్ కంచికచర్ల మండల పరిషత్‌కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌కు రీటెండర్ల ద్వారా వేలం నిర్వహించి ప్రభుత్వానికి ఆదాయం పెంచేలా చూడాలని సభలో ప్లకార్డు ప్రదర్శిస్తూ నిరసన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

తెలిపారు. ఈ విషయాన్ని ఎజెండాలో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బండి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ గత పాలకవర్గం అద్దె ప్రాతిపదికన షాపులు కేటాయించిందన్నారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగలేటి మాధవి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎల్‌హెచ్‌ఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి-మైలవరం: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 బాల బాలికలకు ఫెన్సింగ్ ఎంపికలు గన్నవరంలో జరిగాయి. హనిమిరెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇప్పి విభాగంలో ఎం.అజయ్, ఎం.గుణశేఖర్, పి.సాయి కృష్ణ, ఎన్.చైతన్యలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకయ్య, జి.మెర్సి రోజన విద్యార్థులను అభినందించారు.

అక్షరాక్ష్యతతోనే పేదరిక నిర్మూలన : వసంత

ప్రజాశక్తి-మైలవరం: పేదరిక నిర్మూలన అక్షరాభ్యాసంతోనే సాధ్యమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండలం, చెరువుమాధవరం గ్రామంలో శుక్రవారం రూ.60లక్షలతో నిర్మించనున్న యంపియుపి స్కూల్ భవనానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడుతూ నాడునేడుతో పాఠశాలల అభివృద్ధి చెందుతున్నాయన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-మైలవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగియుండాలని మైలవరం జూనియర్ సివిల్ జడ్జి షేక్ షిరీన్ అన్నారు. తనకు లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాహేలి - ద గర్ల్స్ క్లబ్, ఐసిసి ఆధ్వర్యంలో కళాశాలలో పనిచేస్తున్న మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేదింపులకు సంబంధించిన నిబంధనలు, నివారణ, నిషేధం, పునరుద్దరణ చట్టం -2013 అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెంటర్ కె.రాణి రుద్రమ, మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యం.రవికుమార్, న్యాయవాదులు వెంకట్రావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలం కొమిరెడ్డిపల్లి గ్రామ శివారు గొల్లగూడెం సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మతి చెందాడు. వావిలాల గ్రామానికిచెందిన దుగ్గిరాల రాంబాబు (32) ధన్యం లోడుకోసం ముష్టికుంట్ల ట్రాక్టర్ తో వస్తుండగా గొల్లగూడెం సమీపంలోకి రాగానే ట్రాక్టర్ బోల్తా కొట్టింది. దీనితో రాంబాబు అక్కడిక క్కడే మతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం విటిపియస్ కూలింగ్ కెనాల్ స్టేజ్ 2 వద్ద గుర్త తెలియని మగవ్యక్తి మృతదేహం లభ్యం అయినట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు. వయస్సు 30 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చు. క్రీమ్ కలర్ ప్యాంట్ నలుపు బన్నీ బ్లూ టీషర్ట్ మెడలో ఎరుపు రంగు తాయత్తు ఎడమ కాలికి నలుపు తాడు గుర్తులు గల వ్యక్తిని తెలిసిన వారు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలన్నారు.

నకిలీ డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్



ప్రజాశక్తి-గన్నవరం

కృష్ణా, గుంటూరు జిల్లాల సివిల్ సప్లైస్ డిప్యూటీ కలెక్టర్ అతారమెత్తిన ఓ డూప్లికేట్ మాయగాడు చివరకు కటకటాల పాలయ్యాడు. ఓ మహిళ నుంచి అక్రమంగా లక్షలన్నర రూపాయలు వసూలు చేయడం కోసం గన్నవరం వచ్చిన చీటర్ ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే విజయవాడ చిట్టీనగర్ కు చెందిన పిళ్లా వెంకట రాజేంద్ర సిఆర్ డిఏ ఆఫీసులో కాంట్రాక్ట్ లేబర్ గా పనిచేస్తూ అవినీతి ఆరోపణలతో ఉద్యోగం నుండి తొలగించారు. ఆ తర్వాత కృష్ణ, గుంటూరు సివిల్ సప్లైస్ డిప్యూటీ కలెక్టర్ గా ఒక డూప్లికేట్ ఐడి కార్డు క్రియేట్ చేసుకుని మోసాలకు తెగబడ్డాడు. అందులో భాగంగా గన్నవరం సొసైటీ పేటకు చెందిన యామర్తి అరవింద్ తో ఫోన్లో రాజేంద్ర కు పరిచయం అయింది. రెవెన్యూ శాఖలో వివిధ రకాల పనులు చేయించడం కోసం, కాంట్రాక్టు ఇప్పించడం కోసం అరవింద్ కుటుంబ సభ్యుల నుండి 8.49 లక్షల రూపాయలు రాజేంద్ర తీసుకున్నాడు. అదేవిధంగా స్మార్ట్ ఫోన్, వాషింగ్ మిషన్ వంటి వస్తువులు కూడా కొనుగోలు చేయించి తీసుకున్నాడు. అయితే అరవింద్ కుటుంబ సభ్యులు చెప్పిన పనులు చేయకుండా, తీసుకొన్న డబ్బులు ఇవ్వకుండా, ఫోన్ ఎత్తకుండా రాజేంద్ర మాయం అయిపోయాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు అరవింద్ విజయవాడ చిట్టినగర్ లోని మాయగాడు ఇంటి వద్దకు వెళ్లి వాకబు చేశాడు. అతను డిప్యూటీ కలెక్టర్ కాదని, ఎప్పుడో ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడని పెద్ద మోసగాడని చుట్టుపక్కల వారు చెప్పడంతో తాను మోసపోయినట్లుగా బాధితుడు గమనించాడు. ఏదో ఒక విధంగా రాజేంద్ర ను పట్టుకోవాలని పథకం రూపొందించాడు. వేరొక నంబర్ ద్వారా రాజేంద్ర కి ఫోన్ చేసి రెవెన్యూ ఆఫీసులో ల్యాండ్ సమస్య ఉందని దానిని పరిష్క రించడానికి లక్షన్నరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. డబ్బులు ఇస్తామని రమ్మని చెప్పడంతో మాయగాడు రాజేంద్ర గురువారంరాత్రి వేళలో గన్నవరం వచ్చాడు. అరవింద్ అతని స్నేహితులు కలిసి రాజేంద్రను పట్టుకుని గన్నవరం పోలీసులకు అప్పగించారు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాసరావు నిందితుడిని ప్రశ్నించి పూర్తి వివరాలు రాబట్టారు. శుక్రవారం గన్నవరం కోర్టులో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ కు ఆదేశించారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తదితరులు

ఎలిమెంటరీ స్కూల్ అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - వన్‌టౌన్

పశ్చిమ నియోజకవర్గంలోని 50 డివిజన్ కస్తూరి సీతారామయ్య ఎలిమెంటరీ స్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు శుక్రవారం పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు కిచెన్ రూమ్, డైనింగ్ హాల్ నిర్మాణ పనులు కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ స్థానిక స్కూలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ పుండ్కర్ దృష్టికికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్కూలు వంట గది, విద్యార్థులు భోజనం చేయుటకు డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ. 12 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. విద్యార్థుల మనోవికాసానికి ఆటస్థలం ఆట పరికరాలు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమ్యూనిటీ సెక్రెటరీ కీర్తి, స్థానిక స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు ఎ. అరుణ్ కుమారి, స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు ఎస్‌డి కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కాగిత కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి- పెడన

పెడన నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని శుక్రవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజవర్గ సమస్యలపై, పార్టీ కార్యక్రమాలు పై పార్టీ సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం టిడిపి భవిష్యత్తులో నిర్వహించనున్న 'ఇదేం కర్మ రాష్ట్రానికి' అనే కార్యక్రమాని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని దిశా నిర్దేశం చేశారు.



చంద్రబాబునాయుడితో సమావేశమైన కృష్ణప్రసాద్

రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవ భవనంలో శుక్రవారం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు వీరబత్తిన రత్నకుమారి జ్ఞాపకార్థం, ఆమె 50వ జన్మదినం సందర్భంగా ఆమె భర్త వీర బత్తిన రాంబాబు చీఫ్ ఇంజనీర్ సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ వల్లభనేని సుబ్బారావు చౌదరి ప్రారంభించారు. డాక్టర్ నిమ్మగడ్డ రాజా, డాక్టర్ షైనీ బిళ, డాక్టర్ సుమతి, డాక్టర్ ఎస్ దుర్గాప్రసాద్, సిహెచ్ బ్యూలా రాణి లు వివిధ రకాల వైద్య సేవలను అందించారు. 370 మంది రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ, ఏ ఫణిగోపాల్, కే బాపయ్య చౌదరి, ఈ ఉమా మహేశ్వరరావు, రాజా, ఎస్ పరం ధామయ్య, జే. మోహన్ రావు, బి. శ్రీనివాసరావు, పి రవికుమార్, పి ఎస్ వెంకటేశ్వరరావు, వి. బాపయ్య, ఈ. రవీంద్ర, చిట్టిబాబు, విశ్వం, సుబ్రహ్మణ్యం, కే రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ఈ నెల 27 ఆదివారం పెద్దేశ్వర్ హార్ట్ కేర్ సెంటర్, లయన్స్ క్లబ్ మచిలీపట్నం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించుచున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్తానిక హిందు జూనియర్ కాలేజి లో ఉదయం 9 గంటల నుండి సాయత్రం 4 గంటల వరకు జరిగే ఈ శిబిరం లో విజయవాడలో ప్రముఖ గుండె వైద్యనిపుణులు డా. పల్లెం పెద్దేశ్వరరావు, డా. ఆకాష్ పల్లెం గుండె సమస్యలు, ఈ సీ జి,గుండె స్కానింగ్, బి పి, షుగరు, నరాలకు సంబంధించిన వ్యాధులు, అన్ని రకాల జనరల్ వ్యాధులు ఉచితంగా చూస్తారని, ఈ అవకాశాన్నిప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజయ కాన్వెంట్ లో ...

ప్రజాశక్తి-చల్లపల్లి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయవాడ రోడ్డు లోని విజయ కాన్వెంట్ లో ఆదివారం ఉదయం ఐదు గంటల నుండి 11 గంటల వరకు రెగ్యులర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఫిట్స్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహి స్తారని, ఈ అవకాశాన్ని ఉపయో గించుకోవాలన్నారు.

మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం దావాజిగూడెంలోని ముక్కామల జగదీశ్వరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా శుక్రవారం ఏర్పాటు చేశారు. నవజీవన్ బాల భవన్ సమన్వయ కార్యకర్త జె ఆంజనేయులు మాట్లాడుతూ మత్తు తో బతుకు దుర్భరం అన్నారు. అందమైన విలువైన జీవితాన్ని మత్తు పధార్థాలతో దుర్భరం చేసుకోవద్దు అని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ డి శ్రీవల్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ విజయ రామారావు, ఉపాధ్యాయులు కిషోర్, స్వర్ణ లత, సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి : సింహాద్రి

ప్రజాశక్తి-ఘంటసాల

మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని వి.రుద్రవరం గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలు అందించారు. గ్రామంలో అంతర్గత రోడ్లు అభివద్ధి చేయాలని ప్రజలు కోరగా ఆయా రోడ్లు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మల మురళీ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, ఎంపీటీసీ కొలుసు ఝాన్సీలక్ష్మి, వి.రుద్రవరం, చిలకలపూడి, తెలుగురావుపాలెం సర్పంచ్లు యనిగళ్ల రామకృష్ణ ప్రసాద్, కొణతం విజయలక్ష్మి, రాచూరి ప్రసాద్ బాబు, వైసీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, యువనేతలు వేమూరి ప్రవీణ్, చిట్టూరి రమేష్, మాజీ సర్పంచ్ తూము రామారావు, వైసీపీ నేతలు చింతా రామచంద్రరావు, తూము మధుసూదనరావు, కొణతం శ్రీనివాసరావు, ఎంపీడీవో కె. వెంకట సుబ్బారావు, తహసీల్దార్ బి.రామా నాయక్, పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈలు జె.నాగేశ్వరరావు, బ్రహ్మం, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శివరామ ప్రసాద్. గ్రామసచివాలయం, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : విజయవాడ- మచిలీపట్నం రహదారిపై ఉయ్యూరు పట్టణ పరిధిలోని రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపాన కారు ఢీకొని ముఠాకార్మికుడు శుక్రవారం మృతిచెందాడు. పామర్రు మండలం జుజ్జువరం గ్రామానికి చెందిన కాగిత దుర్గా రావు(47) ఉయ్యూరులో పెద్ద ముఠాలో కార్మికుడిగా పనిచేస్తుంటాడు. శుక్రవారం ఉద యం ద్విచక్రవాహనంపై ఉయ్యూరు వస్తుండగా రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపాన వెనుక వస్తున్న కారు ఢీకొని తలకు గాయమై అక్కడికక్కడే మరణించాడు. ఢీకొన్న కారు ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసునమోదు చేసి, ప్రమాదానికి కారణమైన కారును గుర్తించేందుకు పెట్రోల్ బంకులో సీసీపుటేజి పరిశీలించి గాలింపు చర్యలు చేపట్టారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-మోపిదేవి : మండల పరిధిలోని పేద కల్లేపల్లి గ్రామం వద్ద కృష్ణానది కరకట్ట పక్కన నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై మోపిదేవి ఎస్ఐ సిహెచ్ పద్మ తమ సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులు, రూ 15 వేల నగదు, 11 బైకులు, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-కోడూరు

వ్యాధుల బారినపడిన రోగులను చిన్న చూపు చూడకూడదని వ్యాధుల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మచిలీపట్నం అసిస్టెంట్ మలేరియా అధికారి పి.ఎస్ రాజు అన్నారు. కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం గ్రామంలో గల శ్రీ చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కీటక జనిత వ్యాధుల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.ఎస్ రాజు పాల్గొని మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ , చికెన్ గున్యా, ఎల్లో ఫీవర్ , హెచ్ఐవి, ఎయిడ్స్ , మద్యపానం సేవించడం వలన కలిగే అనర్థాలు, ఆహార కలుషితం, నీటి కలుషితం వలన కలిగే అనర్థాలు, తల్లి నుండి బిడ్డలకు సోకే ఇన్ఫెక్షన్స్ ల గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలా వెంకట రమణ అధ్యక్షతవహించిన ఈకార్యక్రమంలో వైద్య శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బందం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకూ మనప్రభుత్వంలో కిట్టు



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మచిలీపట్నంలోని శ్రీనివాసనగర్ లో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని యువ నాయకులు పేర్ని కిట్టు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మేకా లవకుమార్ , వాలిసెట్టి రవిశంకర్ , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగంటికి గురజాడ పురస్కారంపై అభ్యంతరం

గుడివాడ : గురజాడ పేరుతో ఇచ్చే సాహితీ పురస్కారాన్ని చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడంపై సాహితీ స్రవంతి కన్వీనర్ ఎల్.సురేంద్ర నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యుదయ వాది ప్రజాకవి గురజాడ పేరుతో ఇచ్చే సాహితీ పురస్కారాన్ని ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు కు ప్రకటించడం అన్యాయమని, గురజాడకు తీరని అవమానం అన్నారు. కో.కన్వెనర్ బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలను కించపరుస్తూ వస్త్ర ధారణ గురించి మాట్లాడే వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కవి వసుదా బసవేశ్వరరావు మాట్లాడుతూ దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి చోడవరపు రూప, అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం గురజాడ దేశభక్తి గీతాన్ని ఆలపించారు.



మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: వేమవరం గ్రామంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో డిసెంబర్ 8, 9, 10 తేదీలలో జరుగుతున్న ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ పేదలకు ఇల్లు స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన జగనన్న కాలనీలు పథకం వేమవరంలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, రైతు సంఘం నాయకులు తాడిశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-తిరువూరు: ప్రభుత్వం ధాన్యం ఆర్బికె సెంటర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పిందే తప్ప ఆచరణలో ఏ రైతు నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని ఆంధ్రప్రదేశ్ సంఘం మండ ల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి ఎం. ప్రభాకరరావు ఆరోపించారు. శుక్రవారం తిరువూరు శివారు పి.టి.కొ త్తూరు లో కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యా న్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని చెప్పే ప్రభుత్వ మాటలు శూన్యంగా ఉన్నా యన్నారు ఆర్ బికే లలో అక్కడక్కడా మొక్కుబడిగా మాత్రమే ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు కూడా పంపలేదన్నారు. ప్రభుత్వం వెం టనే గోనె సంచులతో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసి ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

భవానీపురంలో గ్యార్మీ వేడుకలు

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురంలోని ఏ. క్యూ. రజా కమిటీ అధ్యక్షులు షేక్ గయాజుద్దీన్ (ఐజా) ఆధ్వర్యంలో 16వ గ్యార్మీ మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 41వ డివిజన్ దర్గా సమీపంలో గల 350 సంవత్సరాల చరిత్ర గల జండా చెట్టు వద్ద జరిగిన కార్యక్రమంలో గయాజుద్దీన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీన సుమారు ఐదు వేల మందికి అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ ఎం.డి.ఇర్ఫాన్, జనసేన నగర నాయకులు అమ్మిశెట్టి వాసు, ఎక్కు రజా కమిటీ పెద్దలు ఎస్.కె. ముస్తు, ఎన్‌డి ఆలీ, ఎస్.కె.మాన్‌సూర్, ఎస్.కె.మహమూద్, ఎస్.కె. జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంజనీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శనల ద్వారా మంచి విజ్ఞానాన్ని పొందవచ్చని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ అన్నారు.



ఆ కళాశాల ఈఈఈ విభాగ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గాంధీహిల్ వద్ద 11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యుత్ సరఫరాకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను వారి వారి రంగాల్లో తీర్చిదిద్దేందుకు ఈ విధమైన కార్యక్రమాలు ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో రూ.70 కోట్లతో చేస్తున్న అభివృద్ధి పనుల్లో భాగంగా శ్రీ మల్లేశ్వర స్వామి



వారి ఆలయ పునర్నిర్మాణ పనులను దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు త్వరగా కాంట్రాక్టర్‌కు కొన్ని సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఇ. దర్భుముళ్ల భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణలో ప్రభుత్వాలు విఫలం : ఐద్వా

ప్రజాశక్తి-విజయవాడ: హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాధానగర్ జూనియర్ కాలేజీ వద్ద ఉన్న ప్రధాన రహదారిపై ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. మద్యం, మత్తు మందులను నివారించాలని, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ విద్యార్థినులు, ఐద్వా నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళ్తున్నప్పటికీ, హింసను కూడా విభిన్న రూపాలలో ఎదుర్కోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు చదువు కోసం స్వేచ్ఛగా బయటకు వచ్చే పరిస్థితి కానీ, ఇంటా బయటా కూడా మహిళలకు రక్షణ లేని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. చట్టాలు అమలులో ఉన్నప్పటికీ వాటిలోని లోపాలను ఉపయోగించుకొని నేరస్తులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని అన్నారు. ఎన్నికలలో మహిళా సాధికారతపై ఇచ్చిన హామీలను గెలిచిన తరువాత ప్రభుత్వాలు అమలు చేయడంలేదని విమర్శించారు. చట్టాలు చేసినా వాటి అమలులో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. చిన్నపిల్లలు కూడా లైంగిక దాడులకు గురవుతున్నారని, గంజాయి, మత్తు పదార్థాలకు యువత పెద్ద సంఖ్యలో బానిసలుగా మారుతున్నారని అన్నారు. వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయన్నారు. మద్య నియంత్రణ అమలు చేస్తానన్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా కొత్త బార్ షాపులకు అనుమతులు ఇస్తున్నారని అన్నారు. విజయవాడ లాంటి నగరాలలో ప్రజాప్రతినిధులే మద్యం షాపులను నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.సరోజ, జి.ఝాన్సీ, సుజాత, అమ్ములు, పిచ్చమ్మ పాల్గొన్నారు. ప్రజాశక్తి-తిరువూరు: పట్టణంలోని జైభావి రేగి చెట్టు సెంటర్‌లో అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలకు చెందిన విద్యార్థినీలతో కలిసి ఐద్వా నాయకులు, మహిళలు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్.కుమారి, పి.తులసీరాణి, ఎం.లక్ష్మీ, ఎం.మరియమ్మ, ఎం.నాగమణి, సిహెచ్.శ్రావణి, రిటైర్డ్ అధ్యాపకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ రాధానగర్‌లో విద్యార్థినుల మానవహారం



తిరువూరులో...

కృష్ణా వర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కృష్ణా విశ్వవిద్యాలయం పురుషుల బ్యాడ్మింటన్ జట్టును ఎంపికచేసినట్లు పి.బి. సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ నెల 17, 18 తేదీలలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడాకారుల వివరాలను తెలియచేశారు. పి. ఈశ్వర్ సాయి, వై.మహేష్ వంశీ, వి.కృష్ణసాయి, కె.రాజు (ఎఎన్ఆర్ కళాశాల – గుడివాడ), జె.ఎస్. మురళీధర్ (సప్తగిరి డిగ్రీ కళాశాల – విజయవాడ), వి.భానుతేజ (సిద్ధార్థ కళాశాల – విజయవాడ), షేక్ భాషా (డాక్టర్ ఎల్. హెచ్ఆర్. కళాశాల – మైలవరం) ఎంపికయ్యారు. ఈజట్టు వచ్చే నెలలో జరుగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.




అర్హులందరికీ పథకాలు : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 54వ డివిజన్‌లోని 187వ సచివాలయం పరిధిలో 144వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే ఆయా ప్రాంతాలలో పర్యటించి గడపగడపకు వెళ్లి ప్రజలకు ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియచేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు రిజ్వాన్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్ అకీబ్, 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-మైలవరం: 2017లో రోడ్డు విస్తరణలో గృహాలు కోల్పోయిన వెల్వడం –చంద్రాల గ్రామాలకు చెందిన



బాధితుల పై అధికారులు నిర్లక్ష్యం తగదని సిపిఎం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు అన్నారు. బాధితులతో కలిసి శుక్రవారం అధికారుల తీరును నిరసిస్తూ వెల్వడం గ్రామ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల నుండి అనేకసార్లు కలెక్టర్, ఆర్‌డిఒలకు వినతిపత్రాలు ఇస్తున్నా బాధితులకు న్యాయం జరగలేదని, అధికారుల నిర్లక్ష్యం మూలంగానే కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి లబ్దిదారులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, వజ్రాల వెంకటరెడ్డి, ప్రత్తిపాటి నాగేశ్వరరావు, ఎస్.ఇస్సాక్, కిరణ్ పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భవానీపురం: ఇటీవల టిప్పర్ ఢీకొని రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొల్లపూడిలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు ముఠా కార్మికుల కుటుంబాలకు కంపెనీ నిర్వాహకుల నుంచి సిఐటియు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం ఇప్పించారు. శుక్రవారం భవానీపురంలోని పుచ్చలపల్లి సుందరయ్య గ్రంథాలయం కార్యాలయంలో సంబంధిత కంపెనీ మేనేజర్ మురళీ, కిషోర్, సతీష్ జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన మొకర నీలకంఠం, ఊర్మిళానగర్‌కు చెందిన ఆవుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ పశ్చిమ కార్యదర్శి కరీముల్లా, ముఠా కార్మిక నాయకులు వెంకటేశ్వర్లరావు (చౌదరి) పాల్గొన్నారు.



గొర్రెల మేకల సంఘం నూతన కమిటీ

ప్రజాశక్తి-చందర్లపాడు: మండలంలోని ఉస్తేపల్లి గ్రామ గొర్రెల మేకల సంఘం అధ్యక్షునిగా దుద్దుకూరి వెంకట కష్టారావు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ముప్పాళ్ల పశుసంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ నీరజ తెలిపారు. పాధ్యక్షులుగా లిక్కి చంద్రశేఖర్ ,కోశాధికారిగా కోట ప్రసాద్‌రావు, డైరెక్టర్లుగా సిద్దె పెంటయ్య, దుద్దుకూరి రామయ్య, మద్రి ద్వారక్, షేక్ రన్ హుస్సేన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

వెలంపల్లికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: వైసిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుగా రెండో సారి నియమితులైన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుని ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని వెలంపల్లి స్వగృహంలో కలిసి శాలువా, పుష్పగుచ్చంతో ఎమ్మెల్యేను సత్కరించి అభినందనలు తెలిపారు.



సివిల్ విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్‌పై వర్క్‌షాపు



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎంవిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో యూనిక్ సర్వే సొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల సివిల్ విభాగాధిపతి డాక్టర్ పి.బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం నగరంలోని సంస్థ కార్యాలయం నందు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపులో విద్యార్థులకు టోటల్ స్టేషన్ పరికరంతో సర్వే పద్ధతి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈపరికరం వాడటం వల్ల రోడ్డు, భవన నిర్మాణాలు అతి తక్కువ సమయంలోనే కొలవవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ టోటల్ స్టేషన్ పరికరం ద్వారా సాధన చేయగలిగితే నిర్మాణ రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వర్క్‌షాపులు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ముత్తవరపు శ్రీనివాసబాబు, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎం.రామకృష్ణ, సివిల్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

బందరు సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నం నియోజకవర్గ సమస్యలపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్ లో మచిలీపట్నం నియోజకవర్గ సమస్యలపై రెవెన్యూ, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని నాని తన నియోజక వర్గంలో ప్రజా సమస్యల పరిష్కరించాలని జిల్లా కలెక్టరును కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాని వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ, జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం ఓటీఎస్ పై అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. అలాగే ఓటీఎస్ పూర్తి స్వచ్ఛందమని ప్రజలకు స్పష్టం చేయాలనీ అన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులు ఎంచుకున్న ఆప్షన్ 3 కింద ప్రభుత్వమే కట్టించనున్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్ఓ, ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ. కిషోర్, తహశీల్దార్ సునీల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



పట్టపగలే వీధిదీపాల వెలుగులు

ప్రజాశక్తి-చల్లపల్లి

మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఇందిరా కాలనీలో రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్ కాంతులు విరాజిల్లుతున్నాయి. గ్రామపంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు పంచాయతీలలో ఆదాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో రాత్రి పగలు తేడా లేకుండా విద్యుత్ లైట్లు వెలగడంపట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేసుతన్నారు. అనవసరంగా విద్యుత్తు వాడకం పెరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోక పోవడం శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శలు వినిపిస్తున్నాయి.

రుద్రరాజు నియామకంపై హర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ

పిసిసి అధ్యక్షుడిగా గిడుగు రుద్రరాజును నియమించడం పట్ల అవనిగడ్డ కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు దిడ్ల వీర రాఘవులు విలేకరులతో మాట్లాడుతూ రుద్రరాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు రుద్రరాజు నాయకత్వంలో కషి చేస్తామన్నార. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ, మైనార్టీ సంఘం నాయకులు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం అల్లాపురం గ్రామంలో శుక్రవారం పరిసరాల శుభ్రత పై అవగాహన ప్రచార కార్యక్రమం ప్రజా కళాకారులు నిర్వహించారు. కళా బంద సభ్యులు ఎం.ప్రశాంత్ కుమార్ , ఎం.రాము, వి.దేవప్రసాద్, వై.వీరయ్య, వై.కుమార్, రాజేష్ పాటలు వీధి నాటికల ద్వారా గ్రామంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. ప్రజలందరినీ ఆలోచింప చేస్తున్నారు. ఈ సందర్భంగా అల్లాపురం పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ కళారూపాల ద్వారా ప్రచార కార్యక్రమం గ్రామాల్లో జరుగుతుందన్నారు. స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత తదితర ఆరోగ్య విషయాలపై కళాభారతి బిళ్లపాడు వీధినాటిక బందం కళాకారులు పాటలు నాటికలు ద్వారా అవగాహన కల్పించారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కూడా పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కళాకారులు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : కొల్లు



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" అనే కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర సూచించారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఈశ్వర్ రెసిడెన్సీలోని మచిలీపట్టణం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జిల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన నాటినుండి రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితులు నెలకొన్నాయో అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి కొనకళ్ల.నారాయణరావు, మచిలీపట్టణం పార్లమెంట్ ఉపాధ్యక్షులు మండలి రాజా , రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్యా, సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.

ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : అంగన్వాడీ కేంద్రాలకు పిల్లల్ని పంపి ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సంఘసేవకురాలు నర్రా సుధారాణి అన్నారు. స్థానిక పెద్ద మసీదు సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటర్, ఏజీకే నగర్లో మూడు అంగన్వాడీ కేంద్రాలకు రూ.10 విలువచేసే ఫర్నీచర్, వంట సామానులు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. క్లబ్ సభ్యురాలు అన్నే రాణి, దాసరి సుష్మ, క్లబ్ అధ్యక్షురాలు వాణి, విపుల, పద్మ పాల్గొన్నారు.

త్వరలో ప్రతి ఇంటికీ నీటి కుళాయి కనెక్షన్లు : మంత్రి

ప్రజాశక్తి-పెడన

మండల పరిధిలోని కొప్పల్లి సచివాలయం పరిధిలోని ముచ్చిలిగుంట, కొప్పల్లి, ముచ్చర్ల గ్రామాలకు రూ.1.03 కోట్ల వ్యయంతో ఇంటింటికి మంచి నీటి కుళాయి కనెక్షన్లు త్వరలోనే ఇవ్వనున్నట్లు రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం కొప్పల్లి సచివాలయం పరిధిలో బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరితో కలసి మంత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొప్పల్లి సచివాలయం పరిధిలో డ్రైనేజీ, ట్యాంకు, రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ముచ్చిలిగుంట గ్రామంలో స్కూలు నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి నిధులను మంజూరు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం కొప్పల్లి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, అలాగే ముచ్చర్ల గ్రామంలో రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొప్పల్లి, ముచ్చర్ల గ్రామాల సర్పంచులు పూరెళ్ళ దుర్గ భవాని కోటేశ్వరరావు, చందన జగన్మోహన్ రావు, పెడన ఎంపీపీ వాణి అచ్యుతరావు, పెడన ఏఎంసి చైర్మన్ గరికపాటి చారుమతినాయుడు, ఆర్బీకె చైర్మన్ కాగిత సోములు తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ అవనిగడ్డ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ యుటిఎఫ్ మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం శుక్రవారం సంఘ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పివి ఆంజనేయులు, అధ్యక్షులుగా కె జీవేంద్రరావు, సహజక్షులుగా ఎన్ఆర్కెవి ప్రసాద్ సహ అధ్యక్షురాలుగా కే జయశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎన్. శ్రీకాంత్, కోశాధికారిగా బి శివరామకృష్ణ, ఆడిటర్ జీ కష్ణమోహన్, కార్యదర్శులు గా ఎస్ శ్రీనివాసరావు, ఎం రమేష్ బాబు, బి శివలక్ష్మి, ఏ పూర్ణచంద్రరావు, జిల్లా కౌన్సిలర్ గోవిందరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు బి కనకారావు మాట్లాడుతూ వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేటికి రద్దు చేయలేదని, సిపిఎస్ ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : బాపులపాడు మండలం రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి యు.చంద్ర శేఖర్ రాష్ట్రస్థాయి అండర్ -14 బాలుర వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయరాలు సరళ తెలిపారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ అండర్ -14, 17 బాల బాలికల వాలీబాల్ సెలెక్షన్స్‌లో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనగా మంచి ప్రతిభ కనబరిచి చంద్ర శేఖర్ రాష్ట్రస్థాయి జట్టుక ఎంపికయ్యారన్నార. ఈసందర్భంగా చంద్రశేఖర్ ను పలువరు అభినందించారు.



దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రైతు పండించిన ధాన్యానికి తగిన గిట్టుబాటు ధర ప్రభుత్వం అందిస్తుందని, రైతులు దళారుల చేతిలో మోసపోకుండా సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ మహమ్మద్ రహమాన్ సుల్తానా కోరారు. ధాన్యం కొనుగోలు లో భాగంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.2,060, రూ.2030లుగా నిర్ణయించిందని తెలిపారు. ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ సాయన రవికుమార్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్, మండల వ్యవసాయ కన్వీనర్ పెన్నేరు ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

29న బహిరంగ వేలం

ప్రజాశక్తి-పెడన : శ్రీ పైడమ్మ తల్లి అమ్మవారి జాతర మహెూత్సవాలు సందర్భంగా అంగలను ఏర్పాటు చేసుకునే వారి నుండి రుసుము వసూలు చేసుకొనే హక్కుకుగాను పెడన పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో ఈనెల 29 తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పెడన పురపాలక సంఘం కమిషనర్ ఎం అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే సభ్యులు 28 తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటల లోపు శ్రీ పైడమ్మ తల్లి జాతర మహెూత్సవాల గజిట్ పుస్తకం పెడన పురపాలక సంఘ కార్యాలయంలో కొనుగోలు చేసి అందులో గల నిబంధనల ప్రకారం పాటలో పాల్గొనాలన్నారు.

వికలాంగుల పెన్షన్ లబ్ధిదారుల పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో వికలాంగులైన పెన్షన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల పరిషత్ సూపర్డెంట్ అతావుల్లా పులిగడ్డలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం వద్ద లబ్ధిదారులను పరిశీలించారు. అదేవిధంగా వారిని ప్రత్యక్షంగా చూసి లబ్ధిదా రులుగా అర్హత ఉన్నది లేనిది పరిశీలించి పైఅధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎం.హరిబాబు

ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి- ఉయ్యూరు : ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా ఉయ్యూరులోని శ్రామిక భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో దిగుబడి శాతం పెరిగిందన్నారు. ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తోందని, అయితే మిగిలిన ధాన్యాన్ని రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. నిబంధనలు సడలించి ప్రభుత్వం ప్రతి ధ్యాన్యపు గింజను కొనాలన్నారు. ఆర్‌బికె కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ల కొరత ఎక్కువగా ఉందని, దీంతో కొనుగోలులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు సరిగాలేనందున త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసి గోడౌన్లకు తరలించాలని సూచించారు.

నేడు రైతు సంఘాల సమన్వయ సమితి ధర్నాను జయప్రదం చేయండి

విజయవాడ ధర్నా చౌక్‌లో శనివారం జరిగే రైతు సంఘాల సమన్వయ సమితి ధర్నాను విజయవంతం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని విమర్శించారు. విద్యుత్ సవరణ చట్టాన్ని తిరిగి పార్లమెంట్లో పెట్టడం దుర్మార్గమన్నారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం పాల్గొన్నారు.

రైతులను ఎఫ్‌పిఒలో సభ్యులుగా చేర్చండి

అధికారులకు జెసి నుపూర్ అజయ్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : రైతులు పండించిన ఉత్పత్తులను నేరుగా మార్కెటింగ్ చేసుకునేందుకు వారిని ఫార్మర్ ప్రొడ్యుజర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఓ)లో సభ్యులుగా చేర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. నాబార్డ్, వ్యవసాయ, అనుబంధ రంగాలు, సహకార శాఖ అధికారులతో నగరంలోని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఆమె జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ఎఫ్‌పిఒలో రైతులు సభ్యులుగా చేరడం ద్వారా తాము పండించిన ఉత్పత్తులను మధ్యవర్తులు, దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎఫ్‌పిఒలో చేరి రిజిస్ట్రరైన రైతు గ్రూపులు ఐదేళ్లపాటు రూ.25 లక్షల వరకు రుణాలను పొందవచ్చన్నారు. కనీసం 300 మంది రైతులు ఎఫ్‌పిఒలో సభ్యులుగా ఉండాలన్నారు. నాబార్డ్, చిన్న రైతుల అగ్రిబిజినెస్ కన్సార్టియం (ఎస్ఎఫ్ఎసి), నేషనల్ కోఆపరేటివ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సిడిసి) అమలు ఏజెన్సీలుగా వ్యవహరిస్తాయన్నారు. ఇప్పటికే నాబార్డ్ అమలు ఏజెన్సీగా జగ్గయ్యపేట, జి.కొండూరు, మైలవరం



మండలాల్లో ఎఫ్‌పిఒలు కంపెనీ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ అయ్యారన్నారు. ఈఆర్థిక సంవత్సరంలో చంద్రర్లపాడు మండలంలో మిరప, కంచికచర్ల మండలంలో శనగ, నందిగామ మండలంలో పత్తి, మిరప, విజయవాడ రూరల్ మండలంలో మామిడి పంట రైతులకు సంబంధించి ఎఫ్‌పిఒల ఏర్పాటు ప్రతిపాదనలను ఆమోదించినట్లు తెలిపారు. ఈసమావేశంలో నాబార్డ్ ఎజిఎం మిళింద్ చౌసాల్కర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.విజయభారతి, జిల్లా సహకార శాఖాధికారి సిహెచ్ శైలజ, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ధర్మరావు, ఉద్యాన శాఖాధికారి ఏడి బాలాజీ కుమార్, పశు సంవర్ధక శాఖాధికారి కె. విద్యా సాగర్, ఎపిఎంఐపి పీడీ సుభాని, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఎస్.సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగ మల్లిక పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని, సున్న వడ్డీ పంట రుణాలను సద్వినియోగం చేసుకునేలా రైతాంగాన్ని చైతన్యవంతులను చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం కలెక్టర్ డిల్లీరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15,446 మంది రైతులు సున్నవడ్డీ పంట రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. రబీ సీజన్లో 8,440 మంది రైతులకు రూ.2.16 కోట్లు, ఖరీఫ్ సీజన్లో 7,006 మంది రైతులకు రూ.1.83 కోట్లు కలిపి మొత్తం రూ.3.99 కోట్లను ప్రభుత్వం వడ్డీరూపంలో విడుదల చేసిందని తెలిపారు. లక్ష రూపాయలలోపు రుణం తీసుకున్న రైతులు రుణం తీసుకున్న నాటి నుండి సంవత్సరానికి ఒక రోజు ముందుగా తిరిగి చెల్లిస్తే ప్రభుత్వం పూర్తి వడ్డీ రాయితీని కల్పిస్తోందన్నారు. దీంతోపాటు మరో రూ.30 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. పంటల బీమా పథకంలో ఇ-క్రాప్ విధానాన్ని సమర్థవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న మినుము, పెసర, మొక్కజొన్న, పత్తి, చెరుకు తదితర పంటలకు రూ.19.68 కోట్లను బాధిత రైతులు 259 మందికి నష్టపరిహారంగా అందించినట్లు తెలిపారు. అనంతరం మిరప పంటను ఆశించే నల్ల తామర పురుగు సమగ్ర యాజమాన్య పద్ధతుపై ఉద్యాన శాఖ రూపొంధించిన బుక్‌లెట్‌ను, వాల్‌పోస్టర్లను కలెక్టర్ డిల్లీరావు విడుదల చేశారు. ఈసమావేశంలో అగ్రి కల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డి.దామోదరరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయభారతి, ఉద్యాన శాఖ అధికారి ఏడి బాలజీకుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యా సాగర్, ఎపియంఐపి పీడీ సుభాని, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఎస్.సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగ మల్లిక, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

కళాక్షేత్రాన్ని పరిశీలించిన విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలకం సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రాన్ని పరిశీలించారు. ఈనెల 26న రాజ్యంగ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఈపర్యటనలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, ఎడిహెచ్ శ్రీనివాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌వేస్ట్ జనరేటర్లతో సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : స్వచ్ఛ్ సర్వేక్షన్-2023లో ప్రథమ ర్యాంక్ తీసుకురావడమే లక్ష్యంగా శుక్రవారం సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావలి సమీక్ష నిర్వహించారు. తన ఛాంబర్లో బల్క్ వేస్ట్ జనరేటర్లుగా నమోదైన హోటళ్లు, కళ్యాణ మండపాలు, ఎపిఎస్ఆర్‌టిసి వారితో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 1వ తేదీలోపు ఆన్‌సైట్ కంపోస్ట్ మెషిన్లు ఏర్పాటు చేసుకొని ఆయా సంస్థల్లో ఉత్పత్తి అవుతున్న తడి చెత్తను కంపోస్ట్ ఎరువులుగా తయారు చేసుకోవాలని, 2016 సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు అమలు చేయాలని కోరారు. కంపోస్ట్ మెషిన్ల గురించి అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ప్రజారోగ్య శాఖాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, స్వచ్ఛ్ సర్వేక్షన్ పిఎంయు బృందం వారు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం కెబిఎన్ కళాశాలలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను కాంట్రాక్టర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలసుకున్నారు. కాంట్రాక్టు వర్కర్లను, యంత్రాలను ఎక్కువగా పెట్టి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

మొదటి పేజీ తరువాయి

విమానాశ్రయ విస్తరణ బాధిత రైతులకు న్యాయం చేయండి

రంజిత్ బాషా దష్టికి తీసుకువచ్చారు. అమరావతిలో ఇంకా ప్లాట్లు పొందని, నష్టపరిహారం అందని రైతుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మరి కొంతమంది రైతులకు వార్షిక కౌలు సైతం అందడంలేదని వివరించారు. మచిలీపట్నంలోని కలెక్టర్ చాంబర్లో గన్నవరం నియోజకవర్గ సమస్యలపై రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎపిఐఐసి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌కు గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఎంఎల్‌ఎ వంశీ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గన్నవరం మండలంలో 22ఎ నిషేధిత జాబితాలో భూములు గల వారికి అమరావతిలో ప్లాట్లిచ్చినా రిజిస్ట్రేషన్ కావడం లేదన్నారు. విమానాశ్రయం వద్ద వంతెన నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న బ్రహ్మయ్యలింగయ్య చెరువు లిఫ్ట్ డిజైన్‌ను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. రామవరప్పాడు - బొమ్ములూరు మధ్య జాతీయ రహదారి ఇరువైపులా డ్రైనేజి సమస్య ఉందన్నారు. బైపాస్ రోడ్డు వేస్తున్నందున దానికి కూడా డ్రైనేజిలు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కాల్వగట్లపై ఇళ్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదన్నారు. తెంపల్లి తాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేయాలని, కేసరపల్లి లేఅవుట్లో లబ్ధిదారులు వెంటనే ఇళ్లు నిర్మించుకునే నిమిత్తం వంతెన నిర్మించాలని కోరుతూ అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. బాపులపాడులోని 20 ఎకరాల్లో లేఅవుట్ వేసినా దారిలేదని, అందువల్ల భూసేకరణ ప్రతిపాదనలు ఆమోదించి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అజ్జంపూడి లేఅవుట్ చెరువులో వేశారని, అప్రోచ్ రోడ్డు లేదని పేర్కొన్నారు. ఇంకా నియోజకవర్గంలో పలు లేఅవుట్లలో సమస్యలు నెలకొన్ని ఉన్నాయని తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములిచ్చిన రైతుల్లో కొంతమందికి నష్ట పరిహారం అందలేదని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మహేష్ కుమార్ రావిరాల, గుడివాడ ఆర్‌డిఒ పద్మావతి, గన్నవరం బాపులపాడు, ఉంగుటూరు మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

డబ్బులివ్వండి మహాప్రభో...

ప్రభుత్వానికి ఇచ్చిన భూములలో పంటలు వేసుకోవాలో లేదో తెలియడంలేదనే అయోమయంలో రైతులు ఉన్నారు. కళ్లెదుటే భూమి ఉన్నా ఏమీ చేసుకోలేని స్థితిలో ఉన్నామని బాధిత రైతులు, గ్రామ సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డబ్బులు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

మహిళలను గౌరవించడం ద్వారానే హింస నివారణ

కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, ఎం.రత్నకుమారి, జి.గోదావరి, మాధురి లావణ్య, ఎ.విజయలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ ఉమాదేవి, దిశ ఎస్ఐ పూర్ణిమ, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ సువార్త, మానసిక వైద్య నిపుణులు కల్యాణి రెడ్డి, కృష్ణకుమారి, సిడిపిఒలు జి.మంగమ్మ, జి.గ్లోరి, ఎం.లలిత, లక్ష్మీబార్గవి, రేణుక, నాగమణి పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF Ist ADDL. SENIOR CIVIL JUDGE : VIJAYAWADA
I.A.NO. 241/2022
IN O.S.NO. 112/2022

Between :
Karempudi Sindhura ..... Petitioner / Plaintiff
And
Tadikonda Pushpamani ....Respondent / Defendant

To
Tadikonda Pushpamani, W/o Srihari, Hindu, aged 35 years, resident of Door. No.1-90, Uddandarayunipalem,Thulluru Mandal, Guntur District.

The above named Plaintiff filed the above suit against you for cancellation of Regd. Gift deed dated31-05-2019 bearing Document No.2703/2019 on the file of Sub Registrar office, Ibrahimpatnam in respect ofthe plaint schedule property and for other reliefs, and the said suit was posted to 28-11-2022 for your appearance. You have to attend at 10-30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above suit will be decided setting you exparte.

SCHEDULE : Krishna District, Ibrahimpatnam Sub Registrar Ilaka, Vijayawada Rural Mandal, Gollapudi Village, Gollapudi Village R.S.No. 80/2B, an extent of Ac.0.50 cents out of Ac.1.00 being bounded by:- East : land Sold by Uppu Madhusudhana Rao to others South : Property of defendant West : remaining property of Plaintiff, North : Panta Kaluva and Road Within the above boundaries, an extent of Ac.0.50 cents or 0.2024 Hectares of sari dry land along with all ancillary ad easement rights annexed There to.

(By order of the court)
CH, AJAY KUMAR,
ADVOCATE,
VIJAYAWADA-2.
DATE :25/11/2022,
VIJAYAWADA

IN THE HON'BLE COURT OF Ist ADDL. SENIOR CIVIL JUDGE : VIJAYAWADA
I.A.NO. 242/2022
IN O.S.NO. 112/2022

Between :
Karempudi Sindhura ..... Petitioner / Plaintiff
And
Tadikonda Pushpamani ....Respondent / Defendant

To
Tadikonda Pushpamani, W/o Srihari, Hindu, aged 35 years, resident of Door. No.1-90, Uddandarayunipalem,Thulluru Mandal, Guntur District.

The above named Plaintiff filed the above suit against you for cancellation of Regd. Gift deed dated31-05-2019 bearing Document No.2703/2019 on the file of Sub Registrar office, Ibrahimpatnam in respect ofthe plaint schedule property and for other reliefs, and the said suit was posted to 28-11-2022 for your appearance. You have to attend at 10-30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above suit will be decided setting you exparte.

SCHEDULE : Krishna District, Ibrahimpatnam Sub Registrar Ilaka, Vijayawada Rural Mandal, Gollapudi Village, Gollapudi Village R.S.No. 80/2B, an extent of Ac.0.50 cents out of Ac.1.00 being bounded by:- East : land Sold by Uppu Madhusudhana Rao to others South : Property of defendant West : remaining property of Plaintiff, North : Panta Kaluva and Road Within the above boundaries, an extent of Ac.0.50 cents or 0.2024 Hectares of sari dry land along with all ancillary ad easement rights annexed There to.

(By order of the court)
CH, AJAY KUMAR,
ADVOCATE,
VIJAYAWADA-2.
DATE :25/11/2022,
VIJAYAWADA

IN THE HON'BLE COURT OF Ist ADDL. SENIOR CIVIL JUDGE : VIJAYAWADA
O.S.NO. 112/2022

Between :
Karempudi Sindhura..... Plaintiff
And
Tadikonda Pushpamani ....Defendant

To
Tadikonda Pushpamani, W/o Srihari, Hindu, aged 35 years, resident of Door. No.1-90, Uddandarayunipalem,Thulluru Mandal, Guntur District.

The above named Plaintiff filed the above suit against you for cancellation of Regd. Gift deed dated31-05-2019 bearing Document No.2703/2019 on the file of Sub Registrar office, Ibrahimpatnam in respect ofthe plaint schedule property and for other reliefs, and the said suit was posted to 28-11-2022 for your appearance. You have to attend at 10-30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above suit will be decided setting you exparte.

SCHEDULE: Krishna District, Ibrahimpatnam Sub Registrar Ilaka, Vijayawada Rural Mandal, Gollapudi Village, Gollapudi Village R.S.No. 80/2B, an extent of Ac.0.50 cents out of Ac.1.00 being bounded by:- East : land Sold by Uppu Madhusudhana Rao to others South : Property of defendant West : remaining property of Plaintiff, North : Panta Kaluva and Road Within the above boundaries, an extent of Ac.0.50 cents or 0.2024 Hectares of sari dry land along with all ancillary ad easement rights annexed There to.

By order of the court
CH, AJAY KUMAR,
ADVOCATE,
VIJAYAWADA-2.
DATE :25/11/2022,
VIJAYAWADA

గరంగరంగా తోట్లవల్లూరు మండల సమావేశం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని బొడ్డపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తున్న వెంచర్ నిర్వహణలో భాగంగా పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండా సంతకం ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లు తయారు చేయడమే కాకుండా డొంక రోడ్డును ఆక్రమించి వెంచర్లో కలుపుకున్నారని బొడ్డుపాడు సర్పంచ్ మూడే శివశంకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ఏడుపుగంటి రాజమణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. తహసీల్దార్ వెంకట శివయ్య మాట్లాడుతున్న సమయంలో బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్ మాట్లాడతూ ప్రైవేటు వెంచర్కు ఏ విధంగా ఆన్లైన్లో అప్రూవల్ చేశారని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖ సిబ్బంది స్థలానికి వెళ్లి పరిశీలించకుండా అప్రూవల్ ఇచ్చారని, వెంచర్ నిర్వాహకులు పంచాయతీకి సంబంధం లేకుండా తీర్మానం లేకుండా కార్యదర్శి సంతకం కూడా లేకుండా ఫోర్జరీ సంతకాలతో తమను మోసం చేసి వెంచర్కు అనుమతులు తీసుకున్నారని అన్నారు. జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో స్వర్ణలత వివిధ గ్రామాల ఎంపిటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.







కోలాహలంగా సొసైటీ ఎన్నికల నామినేషన్లు

- పోటాపోటీగా ర్యాలీలు
- 38 మంది నామినేషన్లు దాఖలు
- ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరుపున 11, ఈశ్వర్ ప్యానల్ తరుపున 11 నామినేషన్లు

ప్రజాశక్తి-విజయవాడ

"ది విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ "పాలకవర్గం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం కోలాహలంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఆయా ప్యానల్స్ తరుపున అభ్యర్థులతో పాటు వారికి మద్దతు తెలుపుతున్న ఓటర్లు, ఆయా సంఘాల నేతలు ర్యాలీగా వెళ్లి నామినేషన్లను దాఖలు చేశారు. ప్రోగ్రెస్ ఫ్రంట్ తరుపున మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి ఎం డేవిడ్, అలాగే ఎఐటియుసి నాయకులు ఎ రంగనాయకులు, ఇతర పలువురు నాయకులు అభ్యర్థులతో కలిసి లెనిన్ సెంటర్ నుంచి ర్యాలీగా తరలి వెళ్లి నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే ఈశ్వర్ప్యానల్ తరుపున కూడా ఉద్యోగులతో ర్యాలీగా కలిసి వెళ్లి నామినేషన్లు వేశారు. నామినేషన్ల కేంద్రం వద్ద అభ్యర్థులు, వారిని బలపరుస్తున్న వారితో సందడి వాతావరణం నెలకొన్నది. దుర్గా అగ్రహారంలోని సొసైటీ బ్యాంక్ కార్యాలయం పై అంతస్తులో జరిగిన ఈప్రక్రియను ఎన్నికల అధికారి డిప్యూటీ రిజిస్ట్రార్ (రిటైర్డ్) ఎంజె ఏసుదాస్ నిర్వహించి, అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. మొత్తం 38 మంది నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం అన్ని కూడా సక్రమంగానే ఉన్నట్లు ఎన్నికల అధికారి నోటీసు బోర్డులో పెట్టారు. ఎన్నికల బరిలో ఉన్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ తరుపున 11 నామినేషన్లు దాఖలు చేసిన వారిలో జి అజయ్కుమార్ (జూనియర్ అసిస్టెంట్), టి బ్రహ్మారెడ్డి (శానిటరీ ఇనిస్పెక్టర్), వి ప్రభావతి (సూపరింటెండెంట్), జి ఆంజనేయులు (శానిటరీ ఇనిస్పెక్టర్), భూపతి గోవిందరావు (జూనియర్ అసిస్టెంట్), జాకీర్ అహమ్మద్ (టైపిస్టు), సింహాద్రి మస్తాన్రావు (టీచర్), బి రాజేష్ (టీచర్), పి శివశంకర్ (టీచర్), టి నాగరాజు (ఆఫీసు సబార్డినేట్ , మేయర్ పేషీ), జి ప్రభాకర్రెడ్డి (వర్క్ ఇనిస్పెక్టర్) ఉన్నారు. ఈశ్వర్ప్యానల్ తరుపున డి ఈశ్వర్ (సీనియర్ అసిస్టెంట్), టి నాగేశ్వరరావు (సూపరింటెండెంట్), ఎన్ బాలాజీ శ్రీనివాసమూర్తి (శానిటరీ ఇనిస్పెక్టర్), బి హనుమంతరావు (ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టారు), మహమ్మద్ హుస్సేన్ (టీచర్), వి భాస్కరరావు (రికార్డు అసిస్టెంట్), యమ్ దుర్గాప్రసాద్ (మీటర్ రీడర్), గుర్రం జమలయ్య బాబు (శానిటరీ మేస్త్రీ), కారింగి నూకరాజు (పిహెచ్ వర్కర్) నామినేషన్ దాఖలు చేశారు. విఎంసి ఎంప్లాయీస్ మినిస్ట్రీరియల్అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బలపరిచిన ప్యానల్ తరుపున 9 నామినేషన్లు, అలాగే స్వతంత్ర అభ్యర్థుల నుంచి మరో ఏడు నామినేషన్లు దాఖలయినట్లు ఎన్నికల అధికారి ఏసుదానం తెలిపారు.



కొండపల్లిలో ప్రజాసమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : సిపిఎం కొండపల్లి మున్సిపాలిటీ కమిటీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఆఫీస్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కొండపల్లి కమిటీ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 50 కోట్లు నిధులు కేటాయించాలని, మంచినీటి సమస్య పరిష్కారానికి 12 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ పంప్హౌస్ నిర్మించాలని, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలపై పన్నుల భారం తగ్గించాలని, విపరీతంగా వేసిన పన్నులను సవరించాలని, అర్హులైన పేదలందరికీ ఇల్లు ఇళ్లస్థలాలు ఇవ్వాలని జగనన్న కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, అనేక సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న పేదలకు మోహన్రావు నగర్ రిక్షాకాలనీ, శ్రామిక నగర్ ఇబ్రహీంపట్నం, ఫెర్రీ దుర్గా కాలనీ, పుష్కర కాలనీ, భీమరాజు గుట్ట, శక్తి నగర్, గాజులు పేట నివాస ఏరియాలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. సిపిఎం టౌన్ కమిటీ సభ్యులు ఆలేటి విఠలరావు, చింతల శివ, బాడిశ వెంకటేశ్వరరావు, కే బేబీ సరోజిని, ఎన్ ప్రకాష్, షేక్ బాషా, కె నారాయణ, ఎన్ బాబ్జీ, శివ కోటేశ్వరరావు, రమణమ్మ, చిట్టెమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

బలహీన వర్గాల వసతిగృహాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సహాయ సహకారాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీటీసీ సభ్యురాలు గొల్ల కష్ణకుమారి సూచించారు. శుక్రవారం రెండో వార్డ్ లోని బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినీలకు ప్రభుత్వం అందజేసిన దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వసతి గహ అధికారులు దృష్టికి గాని తన దృష్టికి గాని తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను ఎంపీట కృష్ణ కుమారి వార్డు సభ్యులు ధరావత్ కుమారీలు రుచి చూశారు. కార్యక్రమంలో సిబ్బంది కమల, లక్ష్మిలు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న ఎంపీటీసీ కృష్ణకుమారి

రోడ్డు ఆక్రమణల పరిశీలన



ప్రజాశక్తి-మోపిదేవి : మండల కేంద్రం మోపిదేవిలో రహదారిని ఆక్రమించుకొని చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల సమస్యలను అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ శుక్రవారం అడిగి తెలుసకున్నారు. అనంతరం చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బిబి రవికుమార్, మోపిదేవి సబ్ ఇన్స్పెక్టర్ పద్మలతో రహదారి పక్కన తోపుడుబండ్లతో వ్యాపారం నిర్వహించుకుని జీవనం సాగించే చిరు వ్యాపారులను వారి వ్యాపారాలు తిరిగి నిర్వహించుకునే విధంగా చూడాలని మౌఖికంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ జడ్పిటిసి సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లింగ వివక్ష వ్యతిరేక అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : లింగ వివక్షతపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు మండల మహిళా సమాఖ్య ప్రాజెక్టు మేనేజర్ జి కృష్ణంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం లింగ వివక్ష వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ ఏడుపుగంటి రాజామణి, జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి,ఎంపీడీవో స్వర్ణలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు హిమకుమారి, డ్వాక్రా సంఘాల మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలోని ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపించాలని, ఆడ మగ తేడా లేకుండా ప్రతి ఒక్క ఆడపిల్ల చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

ప్రజాశక్తి-పెదపారుపూడి : ఎలాంటి లింగ బేధం లేకుండా అందరూ సమానంగా ఉండాలని తహసీల్దార్ వరుకూటి నాగభూషణం అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామ వీధులలో వెలుగు ఏపిఎం వసంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం లింగవివక్షపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ సమాజంలో మనుషులంతా ఒకటేనని మనుషులలో ఎటువంటి కుల, మత, వర్ణ, వర్గ, విభేదాలు లేకుండా ఐక్యమత్యంగా జీవించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా బాలికలను, మహిళలను మగ పిల్లలతో సమానంగా చూడాలని ఆయన అన్నారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ డి. సాగరిక, మరో వైద్యులు డాక్టర్ వి. శారద ఎస్సై పి. నాగ కళ్యాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఘంటసాల : ఆడ పిల్లలపై వారి తల్లిదండ్రులు లింగ వివక్షత చూపకూడదని సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలో లింగ వివక్షతపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలో ఆడ పిల్లలకు సమాన గౌరవం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, ప్రైవేట్ ఉద్యోగాల్లో అడ పిల్లలు మంచి పరిణితి సాధిస్తున్నారన్నారు. మహిళలు వారి హక్కులను పొందేందుకు చట్టాలు తోడ్పాటునందిస్తున్నాయని, మహిళలకు ప్రతీ ఒక్కరూ అండగా ఉండాలన్నారు. అనంతరం సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జేపే చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పెదపారుపూడిలో...



తోట్లవల్లూరులో...

కాలుష్య నివారణపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

జాతీయ కాలుష్య నివారణా దినోత్సవం సందర్భంగా డిసెంబరు 3వ కాలుష్య నివారణపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు గోరా సైన్సు సెంటర్ డైరెక్టర్ నియంత ఒక ప్రకటనలో తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు పాఠశాల విద్యార్థులకు పోటీలు జరుగుతాయని తెలిపారు. 'కాలుష్య నివారణ అవశ్యకత' అనే అంశంపై వ్యాసరచనపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంగ్లీషు లేదా తెలుగులో వ్రాసే ఈవ్యాసరచన పోటీలలో వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9490 754 655 ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని తెలియచేశారు.

13న ఎపిఎన్‌జిఓ నగర శాఖ ఎన్నిక

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఏపి ఎన్‌జివో అసోసియేషన్ నగర శాఖ ఎన్నికలకు డిసెంబర్ 3వ తేదిన నామినేషన్లను స్వీకరించి 13వ తేదిన ఎన్నికలు నిర్వహించేందుకు ఏపిఎన్‌జివో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ నోటీఫికేషన్ విడుదల చేశారు. ఏపిఎన్‌జివో నగర శాఖలో ఒక అధ్యక్ష పదవి, ఒక సహాధ్యక్ష పదవి, నాలుగు ఉపాధ్యక్ష పదవులు, ఒక కార్యదర్శి, ఒక కార్యనిర్వాహక కార్యదర్శి, నాలుగు సంయుక్త కార్యదర్శులు, ఒక మహిళా సంయుక్త కార్యదర్శి, ఒక కోశాధికారి, మూడు డిఇసి నెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 3వ తేదీ ఉదయం 10 నుండి 12 గంటల వరకు గాంధీ నగర్‌లోని ఏపిఎన్‌జివోలో నామినేషన్‌లు స్వీకరించడం జరగుతుందన్నారు. 13వ తేదీ ఉదయం 9 నుండి 4 గంటల వరకు ఎన్నిక నిర్వహిస్తామని అనంతరం కౌంటింగ్ నిర్వహించి గెలుపు పొందిన అభ్యర్థులను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఏపిఎన్‌జివో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యండి ఇక్బాల్ ఎన్నికల అధికారిగా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.సతీష్‌కుమార్ సహాయ ఎన్నికల అధికారిగా, జిల్లా సహ అధ్యక్షులు సిహెచ్.శ్రీరామ్ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళా శాల విద్యార్థుల ఉపయోగార్థంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఎన్టీఆర్ జిల్లా గవర్నర్ గడ్డం పవన్ కుమార్ కంప్యూటర్ ను వితరణ చేశారు. శుక్రవారం వాసవీక్లబ్ నేతలతో కలిసి కళాశాలో ప్రిన్సిపాల్ రెబ్బు మురళీ కష్ణకు కంప్యూటర్ ను, టేబులను అందజేశారు. ఈకార్యక్రమంలో వాసవీ క్లబ్ నేతలు జూలూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దయ్యే వరకు పోరాటం

సిఐటియు సెంట్రల్ సిటీ మహాసభలో అజయ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్

ప్రజాశక్తి-విజయవాడ: సిఐటియు సెంట్రల్ సిటీ 17వ మహాసభ స్థానిక బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం జరిగింది. ముందుగా సిఐటియు జెండాను సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు ఆవిష్కరించారు. సిహెచ్ శ్రీ లక్ష్మీ, సిహెచ్ సుబ్బారావు ప్రాంగణంలో జరిగిన మహాసభకు కె.దుర్గారావు, టి.ప్రభుదాస్, టి.తిరుపతమ్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిఐటియు జిల్లా నాయకులు టి.ప్రవీణ్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహాసభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కార్మికులు ఉపాధి దెబ్బతిని ఇబ్బంది పడుతున్న కాలంలో ధరల భారం, పన్నుల భారాలను మోపాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. పని ప్రదేశాలతో పాటు నివాస ప్రాంతాల్లో ఉద్యోగ, కార్మికులకు సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, దేశానికి, ప్రజలకు నష్టదాయకమన్నారు. సంక్షేమ పథకాల మాటున రాష్ట్ర ప్రభుత్వం ప్రజా అవసరాలను విస్మరిస్తుందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగుల నివాసాల వద్ద సెంట్రల్ సిటీలో సిఐటియు వాణిని వినిపించడానికి కృషి చేయాలని కోరారు. పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎ కమల, ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె సరోజ, కెవిపిఎస్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి చింతల శ్రీను, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎంవి ఆంజనేయులు పాల్గొని సంఘీభావ సందేశమిచ్చారు. సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎంవి సుధాకర్ ప్రవేశపెట్టిన నివేదికపై ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాసభకు 16 రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

తిరుపతమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ధర్మకర్త బొమ్మ దేవర సుబ్బారావు, నియోజకవర్గ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సతీమణి విమల ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ సుబ్రమణ్యం, మున్సిపాలిటీ కౌన్సిలర్లు గొట్టం మనోహర్ తదితరులు శ్రీ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గ్రామ అభివద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, ఆలయ ధర్మకర్తలు ఆదిమూలం నరసింహారావు, కోలా రామారావు, ఆలయ ఎఇఒ తిరుమలేశ్వర్రావు, సూపరింటెండెంట్ సునీత, ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ పాల్గొన్నారు.



జడ్‌పి స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను నందిగామ డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి గౌరీశంక్ శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. నాడు నేడు పేస్ 2లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం మెనూ అమలు గురించి పాఠశాల హెచ్‌ఎం కె ఎన్‌జే లక్ష్మీ నుంచి వివరాలు సేకరించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి హైస్కూల్లో మధ్యాహ్నం భోజనం చేసి వడ్డించిన ఆహార పదార్థాలు రుచి చూశారు. రుచి శుభ్రతలతో కూడిన ఆహారం వడ్డిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. పాత మోనూ పిల్లలకు బాగా దగ్గరవుతున్న సమయంలో ప్రభుత్వం కొత్త మెనూ తీసుకురావడం వలన ఎండిఎం వర్కర్స్ కొత్త మెనూ గురించి గౌరీ శంకర్ వివరించారు.

ఉత్సాహంగా అంగన్‌వాడీ మహాసభ ప్రారంభం


మల్లు స్వరాజ్యం, రంజనా నిరులా చిత్ర పటాల వద్ద ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సంఘం జాతీయ నాయకులు వరలక్ష్మి తదితరుల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 10వ మహాసభ శుక్రవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ మహాసభకు 26 జిల్లాల నుండి వందలాది మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ వేదికకు ఇటీవల మరణించిన యూనియన్ ఆలిండియా నాయకులు రంజనా నిరులా నగర్‌గా నామకరణం చేశారు. మహాసభల ప్రారంభ సూచికగా యూనియన్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి ఆవిష్కరించారు. ప్రతినిధులు, నాయకులు యూనియన్ జెండాకు విప్లవ జేజేలు పలికారు. అనంతరం అమర వీరుల స్తూపానికి ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, అంగన్‌వాడీ యూనియన్ జాతీయ కార్యదర్శి కె.వరలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో రంజనా నిరులా చిత్ర పటానికి యూనియన్ జాతీయ కార్యదర్శి వరలక్ష్మి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. మహాసభకు యూనియన్ నాయకులు బేబిరాణి, సుప్రజ, బి.లక్ష్మి, లక్ష్మిదేవి, అనసూయమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. గత మహాసభ నుండి నేటి వరకూ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలు, యూనియన్ సాధించిన విజయాలను నివేదిక ద్వారా ప్రతిపాదించారు. కార్యదర్శి నివేదికపై ప్రతినిధులు చర్చించారు. ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ అభ్యుదయ గీతాలకు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మినారాయణ, వై.నేతాజి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమాసుష్మ, దీప్తి మనోజ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పాల్గొన్నారు.



అమరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న సిహెచ్ నర్సింగరావు, రోజా తదితరులు


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రతినిధులు



ఎంవిఎస్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


హాజరైన ప్రతినిధులు


జెండా ఆవిష్కరణ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి, పాల్గొన్న నాయకులు, ప్రతినిధులు






ప్రారంభ సభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, సౌహార్ధ సందేశం ఇస్తున్న ఎస్.పుణ్యవతి, కె.ధనలక్ష్మి, డి.శ్రీనివాసకుమారి